# ఎప్పుడు విముక్తి

అప్పుడే పని ముగించుకుని కాస్త విశ్రాంతిగా కళ్ళు మూసుకు పడుతుంది లక్ష్మి సందులో. మళ్ళా మధ్యాహ్నం భోజనాలయ్యాక కంచాలు కడగాలి అందాక దానికేం పనిలేదు.

ఇల్లు దగ్గరే ఉంది. అయినా అది వెళ్ళదు. ఆ ఇంటికి వెళితే దానికి సుఖం లేదు, శాంతిలేదు. అందుకే అది వెళ్ళదు. మా ఇంట్లో దానికి ప్రాణం పోసినట్లుంటుంది· కాస్త బాధలు మర్చిపోయి కునుకు తియ్యటానికి ఊరటగా ఉంటుంది. అందుకే ఆ సందులో కాస్సేపు వేపచెట్టు నీడలో పడుతుంటుంది.

ఇంట్లో ఇద్దరు మగవాళ్ళున్నారు. దాని మొగుడు, కొడుకు. ఇద్దరికీ సంపాదించవలసి బాధ్యతలేదు. మొగుడు పగలంతా ఊరి వ్యవహాల్లో తల దూర్చి సాయంత్రానికి త్రాగడానికి తయారవుతాడు. కొడుక్కు చదువు రాలేదు. పని దొరకలేదు. అయినా షోకులకేమీ కొదవలేదు. క్రాపింగు దువ్వీ దువ్వీ ఊరిమీదా పడతాడు. ఏ కొత్త సినిమా అయినా ముందు వాడు చూడవలసిందే! ఇద్దరికీ డబ్బు సప్లయి చెయ్యాల్సిన బాధ్యత లక్ష్మిది అందుకే అ డబ్బు కోసం రోజూ తగాదాలు, పోట్లాటలు, తిట్లు, దెబ్బలు. ఇద్దరు మగవాళ్ళకి ఆడది పాచిపనిచేసి ఎంతని సంపాదిస్తుంది. ఎందరిని పోషిస్తుంది అన్న ఆలోచన లేదు. తమకు పనిచేసి సంపాదించవలసిన బాధ్యత ఉన్నదని తెలియదు. తమ అవసరాలకు డబ్బు అందకపోతే లక్ష్మిని తిట్టడం, కొట్టడం అంతే తెలుసు. వాళ్ళ అరుపులకు, దెబ్బలకు

తట్టుకోలేక, చాకిరీ చెయ్యలేక, లక్ష్మి నానాటికి దిగజారిపోతోంది. ఆరు నెలలుగా దాని ఆరోగ్యం ఏమీ బాగాలేదు.

చెవులు వినపడ్డం లేదంటుంది. అన్నం సయించడం లేదంటుంది. అడుగు వేస్తే ఆయాసం అంటుంది. దాని బాధ చూడలేక "ఆస్పత్రికి వెళ్ళి చూపించుకోవే" అని రోజూ చెపుతూనే ఉన్నాను. అయినా అది వినటం లేదు. "వద్దమ్మా ! ఆ ఆస్పత్రిలో మమ్మల్నెవరు చూస్తారు ?" అంటుంది. "పోనీ మాకు తెలిసిన డాక్టరుకు ఉత్తరం ఇస్తాను. వెళ్ళవే !" అన్నాను. అయినా దానికి వెళ్ళాలనిలేదు. అసలు బ్రతకాలనే లేదేమో !

లక్ష్మి కూతురు సీత సదేళ్ళది. ఇంట్లో అన్ని పనులు చేసే బాధ్యత దానిదే! అందరికీ అన్నం వండాలి. నీళ్ళు తేవాలి. ఆ పిల్ల ఒక్కతే లక్ష్మి కోసం తపన పడేది. ఎప్పుడు ఇంటికి వస్తుందా అని ఎదురు చూసేది. ఆ పిల్ల కోసమే ఏ సాయంత్రమో ఉసూరుమంటూ లక్ష్మి ఓపిక చేసుకుని ఇంటికి వెళ్ళేది. రణగొణ ధ్వనులు, రాళ్ళ వాసనలు అయ్యాక తల్లీ కూతురు చాప పరచుకుని మీద చెయ్యివేసుకుని పడుకునేవారు.

ఆరు నెలలకు సీత పెద్దమనిషయింది. డబ్బులేక పోయినా అదొక సంబరం. లక్ష్మి మొగుడు యాభై రూపాయిలు అప్పు పుచ్చుకున్నాడు. ఆరు గంటల సేపు లౌడు స్పీకరు సినిమా పాడలు విరామం లేకుండా మోగించింది. సీతని చాపమీద కూర్చోపెట్టారు. ఇరుగూ, పొరుగూ వచ్చి తలో పావలో ఇచ్చి వెళ్ళారు. నేనూ ఒక జాకెట్టు గుడ్డ ఇచ్చి వచ్చాను. చింపిరితలతో ఉన్న సీతకి మాత్రం ఏ సంబరమూ లేదు. ఏదో చాపమీద కూర్చో మన్నారు కూచుంది. దానికీ మధ్య అప్పుడప్పుడూ గుండె నొప్పి కూడా వస్తోంది. అయినా ఎవరూ పట్టించుకోటం లేదు. మందులు ఇప్పించటం లేదు. దానికేదో దయ్యం పట్టుకుందని లక్ష్మి మొగుడికి మంచి నమ్మకం.

ఎప్పుడైనా పిలిచి "దాన్ని ఆసుపత్రికి తీసుకుపోరా" అంటే వినడు. "అదుగో అక్కడ మంత్రం వేస్తారు తీసుకుపోను, ఇదిగో ఇక్కడ తాయత్తు కడతారుట తీసుకుపోతాను" అంటాడుగాని, "కాదురా దానికి జబ్బురా ! తిండిలేక. చాకిరీ చెయ్యలేక నీరసించిపోతోందిరా !" అంటె వినడు. "లేదమ్మా దానికేంలేదు గాలి." అంటాడు. నాకు కడుపులో బాధగా ఉంటుంది. ఒక మనిషి కళ్ళ యెదుట నీరసించిపోతోంటే ఏమీ చెయ్యలేక చూస్తూ కూర్చోవలసిన పరిస్థితి. వాళ్ళ నమ్మకాలు వాళ్ళవి. అన్నింటికీ మంత్రాలు, పూజలు, వాటికి డబ్బు ఖర్చు పెడతారు గాని మందు లకు కాదు. మందు పుచ్చుకున్నా ఏదో నాటు మందు వాడతారు గాని ఆస్పత్రికి వెళ్ళరు. అదంటే ఏదో పెద్దపులిలా భయం.

రవికల గుడ్డ ఇచ్చి వస్తోంటే సీత బిక్కమొహంతో చూస్తోంది. దానికి తిండిలేదు. కట్టుకోను సరియైన గుడ్డలేదు. యాభై రూపాయల ఖర్చుతో సినిమా పాటలు మాత్రం బ్రహ్మాండంగా మోగుతున్నాయి. ఆ గుడిసెల్లో ఉండేపిల్లలంతా ఆకలి మరచిపోయి ఆనందంగా గంతులు వేస్తున్నారు. దమ్మిడీ సంపాదించకపోయినా ఎందుకిలా డబ్బులు ఖర్చు చేస్తారు ? యాభై రూపాయలతో పదిరోజులైనా కడుపు నిండా అన్నం తిని ఉండవచ్చును గదా ! ఎవరు చెపుతారు ? ఎవరు వింటారు ? పాతుకు పోయిన నమ్మకాలను కదలించే శక్తి ఎవరికీ లేదు. బలవంతంగా లక్ష్మి కుటుంబ బాధ్యతలు నెత్తిన వేసుకునే శక్తి నాకు లేదు. ఊరికే జాలిపడడం తప్ప. లేనివాళ్ళ బాధ్యతలు నెత్తిన వేసుకోడానికి ఉన్నవాళ్ళకెప్పుడూ భయమే ! ఎక్కడ పట్టుకుని వదలరో అని ! ఇద్దరి మధ్యా ఎడం ఎడం గానే ఉంటుంది.

మూడు నెలల తరువాత ఒక రోజు లక్ష్మి మొగుడు సీతను తీసుకుని

ఒక పళ్ళెంలో వక్కా, ఆకులు పెట్టుకుని వచ్చాడు. వాడికి ఏదో వంకన డబ్బు లాగటం సరదా ! ఆ వక్కా, ఆకు పళ్ళెం చూసి. "ఏమిటిరా !" అన్నాను. వాడు ముసిముసి నవ్వులు నవ్వుతూ చెప్పాడు. "సీతకు పెళ్ళండమ్మా ! మా బావమరిది కొడుక్కిస్తున్నాను." అని. విని నేను విస్తుపోయాను. పెద్దమనిషి అయి ఇంకా ఆరు నెలలైనా కాలేదు. పన్నెండేళ్ళు ఇంకా పూర్తిగా నిండలేదు. అప్పుడే దానికి పెళ్ళేమిటి ? ఏం మించుకుపోయిందని ? ఆ మాటే అడిగాను. వాడు నసుగుతో "పిల్ల పెద్దయినప్పట్నుంచి వాళ్ళడుగుతున్నారమ్మా ఏదో చేసేద్దామని!" అన్నాడు. ఏడిచినట్లుంది ! వాళ్ళు అడగడం ! వీడు చెయ్యడం ? అయినా అప్పుడే దానికి పెళ్ళివద్దని, చదివించమని ఇవన్నీ చెబితే ఎవరు వింటారు ? చదివించటానికి డబ్బులేదు. ఈ పెళ్ళివద్దంటే మళ్ళా దీన్నెవడు చేసుకుంటాడు ! ఈ ప్రశ్నలకు నా దగ్గర సమాధానంలేదు. కలిసి వచ్చిన పెళ్ళి పాడుచేసినదాన్నవుతానంతే ! మాట్లాడకుండా వక్కా, ఆకు తీసుకుని రెండు రూపాయలు పళ్ళెంలో వేసి పంపించాను. లక్ష్మి మొగుడు వెళ్ళిపోయాడు- వెనకాలే మెల్లగా తలవంచుకుని సీత వెళ్ళింది. దాని ముఖంలో ఏ భావమూ లేదు. ఊరికే వచ్చింది. వెళ్ళింది. నాకు దాన్ని చూస్తే మెడకు తాడు కట్టిన బలి పశువులా తోచింది.

తరువాత లక్ష్మిని అడిగాను. "ఈ పెళ్ళేమిటి" అని. అన్ని వివరాలు అదీ సంబరపడుతూనే చెప్పింది. కూతురుకి పెళ్ళవుతోందని దానికి సంతోషం. "అవునండమ్మా! మా తమ్ముడి కొడుక్కిత్తన్నాం! ఆడు టీ కొట్లో పనిజేస్తడు" అంది ఆనందంగా. ఆ తమ్ముడి కొడుకును చూశాను. పదహారేళ్ళుంటాయేమో ! నాలుగో క్లాసు చదివాడు. తరువాత టీ కొట్లో కప్పు లందిస్తున్నాడు. రోజుకో రూపాయి వస్తుంది. ఇదీ సంబంధం ఇప్పుడు వాడికో సంసారం ఏర్పాటు ! కాబోతోంది! రూపాయి

తప్పులతో వాడు సీతను పోషించాలి. డబ్బులేకపోయినా పెళ్ళి చాలా అవసరం. అదీ వాళ్ళ మనస్తత్వం.

పెళ్ళి జరిగిపోయింది. పెళ్ళైన రెండు నెలలకే సీత నెల తప్పింది. ఆ తరువాత మరో రెండు నెలలకు ఆకస్మాత్తుగా ఒక రోజు ఆయాసం ఎక్కువై లక్ష్మి పోయింది. అప్పుడు కూడా వాళ్ళు డాక్టరును పిలవలేదు. ఎవరో మంత్రగాడ్నే పిలిచారు మంత్రం వెయ్యటానికి. దానికి పట్టిన గాలి వదిలించడానికి. ఆ గాలి ఆ మంత్రంకన్న చాలా బలమైంది. లక్ష్మితో సహా వెళ్ళిపోయింది తెల్లవారి కబురు తెలిసిన నేను చాలా బాధపడ్డాను. లక్ష్మిని నేను బలవంతంగా డాక్టరు దగ్గరకు తీసుకువెళ్ళి ఉండవలసిందేమో! సరైన వైద్యం జరిగితే అది బ్రతికి ఉండును. ఈ ఆలోచన అప్పుడప్పుడూ మనసులో ముల్లులా గుచ్చుకుంటోంది. అయినా వెంటనే మరచిపోవటానికి ప్రయత్నిస్తున్నాను.

వాళ్ళ జీవితాల్లో మార్పేమీ లేదు. ఎవరూ లక్ష్మిని గురించి ఎక్కువ బాధపడలేదు. సీత మాత్రం దిగులు గుండెల్లో నింపుకుంది. కాకపోతే లక్ష్మి బదులు ఇప్పుడు సీతను పనికి పంపిస్తున్నారు. అది ఇక్కడా, ఇంట్లో రెండు చోట్లా పని చెయ్యాలి. అది ఇంకాస్త మొద్దుగా, ఇంకాస్త మూగగా తయారైంది. నిస్పృహతో ఊరుకుంది. సీత మొగుడు ఇల్లరికం వచ్చాడు. మావ దగ్గరే ఉన్నాడు.

తొమ్మిది నెలలు నిండగానే సీత ప్రసవించింది. దానికో ఆడపిల్ల! పదమూడేళ్ళు నిండకుండానే అది తల్లయింది దానికింకా ఆడుకునే వయసు పోలేదు. కాని ఇప్పుడు దానికో పాప! ఆ పాపను తీసుకునే పనికి వస్తుంది, పని చేస్తుంది. ఒక్కొక్క సారి పనైనా ఇంటికి పోదు. ఆ సందుల్లో ఆ లక్ష్మి పడుకున్న వేప చెట్టుకిందే ఆ పసిపాపను పెట్టుకుని

కళ్ళు మూసుకు పడుకుంటుంది దాన్ని చూస్తూ ఉంటే నాకు మళ్ళా సీతలో లక్ష్మి కనపడుతూ ఉంటుంది. మళ్ళా అదే బ్రతుకు! అదే జీవితం! అదే ముగింపు! ఆకలి, చాకిరీ! తినడానికి తిండిలేదు. కట్టుకోడానికి బట్ట లేదు. చింపిరి జుట్టుకు నూనెలేదు. పోషించడానికి ఒక పాప మాత్రం ఉంది. పాపకు పాలు కావాలి బ్రతక్క తప్పదు. బహుశా సీత పెద్దదయే సరికి సీత కూతురు సరస తయారవుతుంది. ఎప్పటికి ఈ జీవితాలకు విముక్తి?

కరుడుకట్టిన అజ్ఞానం, మూర్ఖత్వం, సోమరితనం, మూఢ నమ్మకాలు, మూర్ఖపు బ్రతుకు. ఆకలి, అలసట, అనారోగ్యం, బురదలోకి కూరుకు పోతున్న ఈ ప్రజలు ఎప్పుడు బయటపడేది. ఎలా బయటపడేది? మనిషికి మనిషి మనసే శత్రువు.

ఈ మనసులు మారే దెప్పుడు? చుట్టూ కమ్ముకున్న చీకట్లు చూస్తూ ఉంటే చిన్ని దీపమైనా వెలిగించలేని అసమర్థతకు సిగ్గు వేస్తోంది.

ఈ సినిమాలు, ఈ రేడియోలు, క్లబ్బులు, కాఫీలు, ఇదంతా ఏదో బూటకంగా తోస్తోంది. ఈ ఆకలి, ఈ అజ్ఞానం ఈ దారిద్ర్యం. ఇదంతా ఏదో దాట శక్యంగాని వాస్తవంగా తోస్తోంది.

కళ్ళు మూసుకుని ఎన్నాళ్ళు కలలుకంటూ బ్రతకటం? కళ్ళు తెరచి భరించలేని ఈ చీకటి చూసి ఏం చెయ్యటం?

చెట్టునీడలో చాప చుట్టలా ముడుచుకుపడుకున్న సీత అజ్ఞానానికి అంధకారానికి, ఆకలికి ప్రతీకలా ఉంది.

"అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజనశలాకయా." ఏదో శ్లోకం సగం గుర్తు వస్తోంది. జ్ఞానాంజనం ఎక్కడ ఉంది? ఎప్పుడు ఉప్పెనలా ముంచుకు వస్తుంది? ఎప్పుడు విముక్తి? ఎప్పుడు విముక్తి?

ఇది బదులులేని ప్రశ్న. *